రాయితీ టమాటా విక్రయాలు ప్రారంభం


టమాటా విక్రయాలు ప్రారంభించిన డీఎస్‌వో శంకరన్, మార్కెటింగ్‌శాఖ ఏడీ పరమేశ్వరన్

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: నిత్యావసర సరకులు, టమాటా ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శంకరన్ తెలిపారు. స్థానిక రైతుబజారులో రాయితీపై నాణ్యమైన టమాటా కిలో రూ.49కు విక్రయ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. నిత్యావసర ధరలు అదుపులోకి వచ్చే వరకు రాయితీపై రైతుబజారులో కందిపప్పు, సన్‌ఫ్లవర్ ఆయిల్, టమాటా విక్రయిస్తామన్నారు. మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వరన్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజరు బాలకృష్ణ, పలమనేరు మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవకుమార్, రైతుబజారు ఎస్టేట్ అధికారి అనిల్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా బుధవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 18 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. మంగళవారం శ్రీవారిని 82,043 మంది దర్శించుకున్నారు. రూ.4.10 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

నేడు నగరిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, అధికారులు అందరూ తప్పక హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

జగద్రక్ష.. ఆశ్రితపక్ష.. గజేంద్రమోక్ష



తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరోరోజు బుధవారం ఉదయం శ్రీమలయప్ప స్వామి శ్రీకోదండ రాముని అవతారంలో ధనస్సు, బాణం ధరించి తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రామాయణంలో మారుతి స్థానం అద్వితీయం. గురుశిష్యులైన శ్రీరామ హనుమంతులు తత్వ వివేచన గావించిన మహనీయులు కనుక ఈ ఇరువురినీ దర్శించిన వారికి పుణ్యఫలం లభిస్తుంది.

స్వర్ణరథంపై ఊరేగిన శ్రీనివాసుడు

బంగారు తేరులో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామిని చూసి భక్తజనం పరవశులయ్యారు. సాయంత్రం శ్రీనివాసుడు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన స్వర్ణరథంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. రాత్రికి గజ వాహనంపై అభయప్రదానం చేశారు. నిద్రలేవగానే ఐశ్వర్యానికి ప్రతీకయిన ఏనుగును దర్శించడంతో భోగభాగ్యాలు లభిస్తాయి. తన సార్వభౌమత్వాన్ని తెలిపేందుకు శ్రీవారు గజ వాహనంపై ఊరేగారు. సేవలో తొలిసారిగా సెంటు జాజుల మాలను వినియోగించారు. పెద్దజీయర్, చిన్నజీయర్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విశాల్‌మిశ్రా, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.



నేటి వాహన సేవలు

ఏడో రోజు గురువారం ఉదయం 8-10 గంటల వరకు సూర్యప్రభ వాహనసేవ, రాత్రి 7-9 గంటల వరకు చంద్రప్రభ వాహనసేవ జరగనుంది.


హనుమ వాహనంపై కోదండ రాముడు
గజ వాహనంపై అభయప్రదానం చేస్తున్న శ్రీవారు
స్వర్ణ రథోత్సవం






నిబంధనలతో మాకేం పని?

- ఉత్తర్వులకు విరుద్ధంగా ఫ్రీ హోల్డ్.. ఆపై రిజిస్ట్రేషన్లు
- జిల్లావ్యాప్తంగా 1,031 ఎకరాలు చేతులు మారిన వైనం
- వైకాపా నేతల ప్రోద్బలంతో యంత్రాంగం మాయాజాలం!

జిల్లాలో ఫ్రీహోల్డ్ తర్వాత రిజిస్ట్రేషన్ జరిగిన భూవిస్తీర్ణం:	నిబంధనలకు అనుగుణంగా చేసినవి:	విరుద్ధంగా జరిగినవి:
2,171 ఎకరాలు	1,140 ఎకరాలు	1,031 ఎకరాలు



ఈనాడు, చిత్తూరు: అధికారం చేతుల్లో ఉన్నప్పుడు నిబంధనలతో పనేంటి? అన్నట్టుగా గత ఐదేళ్లు వైకాపా నాయకులు రెచ్చిపోయారు. ప్రభుత్వ ఉత్తర్వులనే పక్కనపెట్టి అనర్హులకు అసైన్డ్ భూముల్లో యాజమాన్య హక్కులు (ఫ్రీ హోల్డ్) కల్పించి తమ హవా చాటుకున్నారు. అనంతరం వాటిని రిజిస్ట్రేషన్ కూడా చేయించి చేతులు మార్చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత అవకతవకలపై దృష్టి సారించి విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో చట్టవిరుద్ధంగా47 శాతం భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని తేలింది. బాధ్యులైన రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులపై చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో తప్పిదాలు పునరావృతం కావు.

అసైన్డ్ భూములపై లబ్ధిదారులకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ గతేడాది ఆగస్టు 4న వైకాపా ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చింది. 2003 జులై 31కు ముందు అసైన్డ్ పట్టాలు పొందిన వ్యక్తుల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని పేర్కొంది. అర్హుల పేర్లను ముందుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాలని తెలిపింది. తహసీల్దార్లు రూపొందించిన జాబితాలో 5 శాతం సబ్ కలెక్టర్లు/ ఆర్డీవోలు పునః పరిశీలించాలని ఆదేశించింది. ఫ్రీ హోల్డ్ వ్యవహారంపై కలెక్టర్లు, జేసీలు పలు సందేహాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో గతేడాది డిసెంబరు 19న స్పష్టంగా విధివిధానాలు వెలువరిస్తూ జీవో 596ను జారీ చేసింది. డీకేటీ రిజిస్టర్, అసైన్‌మెంట్ కమిటీ మినిట్స్ లేకపోయినా వెబ్‌ల్యాండ్, పీవోఎల్ఆర్ వంటి ఏదో ఒక రెవెన్యూ రికార్డులో రైతు పేరున్నా యాజమాన్య హక్కులు కల్పించాలని ఆదేశించింది. చుక్కల, ఇనాం తదితర భూములపైనా స్పష్టతనిచ్చింది.

నిబంధనల ప్రకారం ఉన్నది 1,140 ఎకరాలే

వైకాపా నేతల ఒత్తిళ్లతో ప్రభుత్వం జారీ చేసిన విధి విధానాలను రెవెన్యూ యంత్రాంగం పక్కనపెట్టింది. నిబంధనలకు విరుద్ధంగా పదేళ్ల కిందట ఇచ్చిన అసైన్డ్ భూములనూ ఫ్రీ హోల్డ్ చేశారు. పుంగనూరు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో 5- 6 ఏళ్లకు ముందు వాటికీ యాజమాన్య హక్కులు కల్పించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 84,378.66 ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేయగా 2,171 ఎకరాలకు రిజిస్ట్రేషన్ జరిగింది. ఇటీవల డిప్యూటీ కలెక్టర్ల బృందం చేసిన పునః పరిశీలనలో నిబంధనలకు అనుగుణంగా ఉన్నవి కేవలం 1,140 ఎకరాలని తేలింది. మిగతా 1,031 ఎకరాలకు అసలు యాజమాన్య హక్కులు వచ్చే పరిస్థితే లేదు. అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతోనే ఇది జరిగిందన్నది స్పష్టం.

గంగాధరనెల్లూరు, పుంగనూరులోనే..

గంగాధరనెల్లూరు, పుంగనూరు నియోజకవర్గాల్లోనే ఎక్కువగా ఇలా అవకతవకలు జరిగాయని తెలుస్తోంది. వెదురుకుప్పం మండలంలోనే దాదాపు 150 ఎకరాలు చేతులు మారాయి. ఆ తర్వాత స్థానాల్లో కుప్పం, చిత్తూరు నియోజకవర్గాలున్నాయి. పేదలకు చెందిన ఈ భూమి అధిక భాగం వైకాపా నేతలు, ధనికులకే చేరింది. నయానో భయానో రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ శాఖ ఫ్రీ హోల్డ్ చేయగానే రిజిస్ట్రేషన్ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే నిషేధిత జాబితా నుంచి తొలగించారు.


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయవిక్రయదారులు

రెండున్నరేళ్లలో 110 రిజిస్ట్రేషన్లే..!

సచివాలయాల్లో ముగిసిన అధ్యాయంలా స్థిరాస్తి లావాదేవీలు

మళ్లీ సేవలన్నీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు

చిత్తూరు (సంతపేట), న్యూస్‌టుడే: స్థిరాస్తి క్రయవిక్రయ వ్యవహారాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పాత్ర కీలకం.. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల పేరిట వైకాపా ప్రభుత్వం అమలు చేసిన సంస్కరణలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోగా.. ఇబ్బందుల్నే మిగిల్చాయి.. జిల్లాలో ఎంపిక చేసిన 69 గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అమలైన రెండున్నరేళ్లలో జరిగిన రిజిస్ట్రేషన్లు 110 మాత్రమే. ఖజానాకు వచ్చిన ఆదాయం రూ.10.88 లక్షలే.. ఈ సంస్కరణలు క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలు అందించలేకపోగా, రిజిస్ట్రేషన్ల కోసం కేటాయించిన సామగ్రి, సిబ్బందికి అందించిన శిక్షణ వృథాగా మారింది.

జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పేరిట రీసర్వే చేపట్టిన వైకాపా ప్రభుత్వం రైతులతో సంబంధం లేకుండానే వారి అభ్యంతరాల్ని పరిష్కరించకుండానే సర్వే చేసింది. తర్వాత ఇచ్చిన భూహక్కు పత్రాల్లో పట్టాదారు పేర్లు, విస్తీర్ణం నమోదులో పెద్దఎత్తున పొరపాట్లు దొర్లాయి. దీనిపై రైతులు సవరణల కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. వాటికి పరిష్కారం చూపకనే అప్పట్లో రిజిస్ట్రేషన్లను మొదలుపెట్టి రైతుల ఆగ్రహానికి గురయ్యారు. వీటి పరిష్కారం కోసం రైతులు తిరుగుతునే ఉన్నారు.

సచివాలయాల్లో సేవల రద్దు..

సచివాలయాల్లో సౌకర్యాల లేమితో రిజిస్ట్రేషన్లు సరిగా జరగక కక్షిదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. గుడిపాల మండలం రామభద్రాపురంలో అత్యధికంగా 22 రిజిస్ట్రేషన్లు జరగగా, గుండ్లసాగరంలో 8, అగరమంగళం సచివాలయంలో 5 రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. 60 సచివాలయాల్లో ఒకొక్క రిజిస్ట్రేషనే జరిగింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తూ ఉత్తర్వులిచ్చారు. దీంతో వినియోగదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాల బాటపట్టారు.

విజన్ కుప్పంతో అభివృద్ధి పరుగులు

- 380 పేజీల ప్రణాళికను త్వరలో ఆవిష్కరించనున్న సీఎం
- సమస్యల పరిష్కారానికి పంచాయతీల వారీగా ప్రజాదర్బార్: కడా పీడీ


మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: 'విజన్ కుప్పం' ప్రణాళిక అమలైతే అభివృద్ధి పరుగులు పెడుతుందని కడా పీడీ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు సొంత నియోజవర్గంలో శాఖల వారీగా రూపొందించిన అభివృద్ధి ప్రణాళిక ముఖ్యాంశాలను పీడీ బుధవారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఐఏఎస్ అధికారి పాలనలో సాగుతున్న కడాకు 17 శాఖల డివిజన్ స్థాయి అధికారులను అనుసంధానించి వచ్చే ఐదేళ్లు చేపట్టే అభివృద్ధిపై 'విజన్ కుప్పం'తో 380 పేజీల ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. దీన్ని ముఖ్యమంత్రికి చూపగా, ఆయన ఎంతగానో సంతోషం వ్యక్తం చేశారని.. త్వరలో ఆయనే ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. 26 శాఖలతో 16 సెక్టార్లుగా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. పేదలందరికీ ఇళ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు, తాగునీరు, వంట గ్యాస్, విద్యుత్ సరఫరాపై ఇంటింటి సర్వే చేపట్టి లోటుపాట్లు నమోదు చేశామన్నారు. దశల వారీగా భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ తెస్తామన్నారు. కుప్పం ప్రాంతంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఆదాయ పెంపు, పరిశ్రమల స్థాపన, ఉపాధి, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మరిన్ని అంశాలను ఆయన వివరించారు.

నీటి ప్రాజెక్టులు

'నీటి సమస్య తీర్చేందుకు జలాశయం నిర్మాణం చేపడతాం. కుప్పంలో ఉద్యానవనాల అభివృద్ధికి ప్రణాళిక, నవియాల ఎకో టూరిజం, కుప్పం పున్నమి రెస్టారెంట్ల అభివృద్ధి చేస్తాం' అని పేర్కొన్నారు.

మూడు పరిశ్రమలతో ఎంఓయూ

'ఇప్పటికే మూడు పరిశ్రమలతో ఎంఓయూ చేసుకున్నాం. మరిన్ని పరిశ్రమలు రానున్నాయి. మహిళలను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహిస్తూనే, వారి ఆలోచనలకు అనుగుణంగా పారిశ్రామికవేత్తలుగా మారుస్తాం. పంచాయతీల్లో విలేజ్ మార్టుల ఏర్పాటుకు పరిశ్రమల సహకారం తీసుకుంటాం. విమానాశ్రయం, పరిశ్రమల స్థాపనకు స్థలం సేకరిస్తాం' అని తెలిపారు.

23 నుంచి ప్రజాదర్బార్

'గ్రామాల్లో ఈనెల 23 నుంచి ప్రజాదర్బార్ నిర్వహిస్తాం. ప్రతి బుధవారం అధికారులతో కలిసి ఓ గ్రామానికి వెళ్లి, అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించేలా ప్రణాళిక రూపకల్పన చేశాం' అని కడా పీడీ వివరించారు.


నేరుగా సీఎం చేతికే వినతులు

సీఎం సొంత నియోజకవర్గ ప్రజల సమస్యలు నేరుగా ఆయనే తెలుసుకునేలా గ్రీవెన్స్ సెల్ పేరిట ఓ విభాగం ఏర్పాటు చేశాం. వీటికి సత్వర పరిష్కారం లభిస్తుంది. కోర్టులోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇద్దరు న్యాయవాదులను నియమించనున్నాం' అని తెలిపారు.

బ్రహ్మోత్సవం.. భక్తోత్సవం

◆ గరుడోత్సవం నిర్వహణలో సఫలం ◆ తితిదే ఏర్పాట్లపై హర్షాతిరేకాలు

ఈనాడు-తిరుపతి; తిరుమల, న్యూస్‌టుడే: వీఐపీల తాకిడి లేదు.. ప్రజాప్రతినిధుల హడావుడి లేదు. సామాన్య భక్తులకు సంతృప్తికర దర్శనమే పరమావధిగా గరుడ వాహన సేవ అంబరాన్నంటిన వేళ శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈసారి ప్రత్యేక చాటాయి. భక్తుల మన్న నలు అందుకున్నాయి. పాలకమండలి లేకున్నా ఉన్నతా ధికారులు కొత్తగా బాధ్యతలు చేపట్టినా కీలకమైన గరు డోత్సవంలో మూడు లక్షల మందికిపైగా భక్తులకు సంతృ ప్తికర దర్శనం కల్పించారు. పారిశుద్ధ్యం, భద్రత, రద్దీ నియంత్రణ చర్యలతో మెప్పించారు.




సమన్వయంతో సాగి..

శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతు న్నాయి. ఏటా గరుడ వాహన సేవను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు వస్తుంటారు. ఈ దఫా సుమారు 3.5 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ఇందుకు అనుగుణంగానే ఏర్పాట్లు చేశారు. మాడవీధుల్లో రెండు లక్షల మంది వరకు భక్తులకు ఏర్పాట్లు చేశారు. అదనంగా సుపథం, నైరుతి, వాయువ్యంతో పాటు వెంగమాంబ అన్నదాన సత్రం వద్ద నుంచి మాడవీధుల్లో వాహనానికి ఇరువైపులా తాళ్ల ఏర్పాటు చేసి భక్తులను వరుస క్రమంలో అనుమతించారు. ఇలా ఒక్కో ప్రాంతంలో గంటపాటు భక్తులను అనుమతిం చడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకునే వీలుకలిగింది. తూర్పు మాడవీధి, వాహన మండపం నుంచి హథీరాంజీ బాబా మఠం వద్దకు వెళ్లగానే ఆలయం ఎదు రుగా గ్యాలరీల్లోని భక్తులను ఖాళీ చేయించి మళ్లీ నింపారు.

కోరినంత ఆహారం

సామాన్య భక్తులకు, గ్యాలరీల్లోని భక్తులకు పూర్తిస్థా యిలో గతంలో ఆహారాన్ని అందించలేకపోయేవారు. ఈ పర్యాయం ప్రతి 5 నిమిషాలకు గ్యాలరీల్లోని భక్తులకు అన్న ప్రసాదాలు, పాలు, కాఫీ, ఉప్మా, బాదం పాలు, బిస్కెట్లను అందించారు. భక్తులే ఇక చాలు అనే పరిస్థితి కనిపించింది. ఒక్క గరుడ సేవ రోజునే ఏకంగా నాలుగు లక్షల మంచినీటి సీసాలను పంపిణీ చేశారు.



◆ ప్రస్తుత గరుడోత్సవంలో వీఐపీలు, రాజ కీయ నాయకుల రద్దీని అధికారులు పూర్తిగా నియంత్రించారు. గతంలో గరుడోత్సవానికి భారీగా వీఐపీల తాకిడితో వాహన సేవల ఎదుట హడావుడి నెలకొనేది. పాలకమం డలి పెద్దలు పోటీలు పడి వారి సేవలో తరించేవారు. వారి తీరుతో అక్కడ పనిచేసే భద్రతా సిబ్బంది, భక్తులకు ఇబ్బందులు తప్పేవి కావు.

అందరికీ అభినందనలు

గరుడ సేవను విజయవంతంగా నిర్వహించిన అన్ని విభాగాల అధికారులను తితిదే ఈవో శ్యామలరావు, అద నపు ఈవో వెంకయ్య చౌదరి అభినందించారు. ప్రణాళిక, అన్ని విభాగాల సమన్వయంతో భక్తులకు సంతృప్తికర దర్శనం కల్పించినట్లు పేర్కొన్నారు. బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతో సామాన్య భక్తులు ఎక్కువ సంఖ్యలో స్వామిని దర్శించుకున్నట్లు చెప్పారు.

45 వేల మందికి జియో ట్యాగింగ్

బ్రహ్మోత్సవాల్లో చిన్నపిల్లలు, వృద్ధులు, వికలాంగులు తప్పిపోకుండా పోలీసులు జియో ట్యాగింగ్ చేపట్టారు. మొత్తం 45 వేలమంది మంది పిల్లలకు జియోట్యాగింగ్ చేసి నట్లు జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు తెలిపారు. కంట్రోల్ రూమ్ ఇన్‌ఛార్జి, అదనపు ఎస్పీ సౌజన్య ఆధ్వర్యంలోని బృందం సభ్యులు బుధవారం తప్పిపో యిన చిత్తూరుకు చెందిన కె.రుషిక(8), తమిళనాడు, ధర్మపురికి చెందిన యాదవ్(8), హైదరాబాద్, అంబ ర్‌పేటకు చెందిన హనీ(8)లను గుర్తించి వారి తల్లిదం డ్రులకు అప్పగించారు.

82 వేల మందికి..

◆ గరుడసేవ రోజున ఏకంగా 82,043 మంది భక్తులు శ్రీవారి మూలవిరాట్టును దర్శించుకోగా 30,100 మంది తలనీలాలు సమర్పించారు.

◆ 2023 శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో 4 వేల మందితో భద్రతా చర్యలు చేపట్టగా, ప్రస్తుతం 5 వేల మందితో చేపట్టారు. గరుడోత్సవం రోజున గతేడాది 1130 మందిని, ప్రస్తుతం 1250 మందిని వినియోగించారు.

◆ మాడవీధుల్లో గతంలో 07 అంబులెన్సులు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం 11 ఉంచారు. గుండె సంబంధిత రోగుల కోసం అలిపిరి, శ్రీవారి నడక మార్గంలో మొదటిసారిగా స్విమ్స్ కార్డియాక్ వైద్యు లతో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

◆ శ్రీవారి సేవకులను గతంలో 3 వేల మందిని విని యోగించగా ప్రస్తుతం 4 వేల మందితోపాటు వెయ్యి మంది శ్రీవారి సేవకులను అదనంగా వినియోగించారు.

◆ మాడవీధుల్లోని 180 గ్యాలరీల్లో గతంలో 8 మంది సెక్టోరల్ అధికారులను నియమించగా ప్రస్తుతం 49కి పెంచారు. సిబ్బంది గతంలో 360 మంది ఉండగా ప్రస్తుతం 563 మందికి పెంచారు.

104 దుకాణాలు.. 1,524 దరఖాస్తులు: ఈఎస్


శ్రీనివాస్

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: మద్యం దుకాణాల దరఖాస్తు గడువును పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 11న రాత్రి 7 గంటల వరకు వ్యాపారులు దరఖాస్తు చేసుకోవచ్చని చిత్తూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో బుధవారం విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం సాయంత్రం 5 గంటల వరకు 104 మద్యం దుకాణాలకు గాను 1,524 దర ఖాస్తులు అందాయని, రూ.30.48 కోట్లు ఆదాయం సమకూరిందన్నారు. 14న సంతపేటలోని ఆర్.ఆర్.గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో లాటరీ తీయనున్నామని చెప్పారు. అర్బన్ ఎక్సైజ్ సీఐ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ తొలి ఎస్‌ఈగా ఇస్మాయిల్‌అహ్మద్



చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం తిరుపతిలో ఉండేది. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలనే సంకల్పంతో సర్కిల్‌ను రెండుగా విభజిం చింది. చిత్తూరులో విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. నూతన సర్కిల్ కార్యా లయం తొలి ఎస్‌ఈగా ఎస్.కె.ఇస్మాయిల్ అహ్మద్‌ను నియమిస్తూ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో వాణిజ్య విభాగం జీఎంగా పనిచే స్తున్న ఆయన్ను చిత్తూరు ఎస్‌ఈగా నియమించారు. ఉమ్మడి జిల్లా ఎస్‌ఈ సురేంద్రనాయుడిని తిరుపతి జిల్లా సర్కిల్ ఎస్‌ఈగా నియమించారు. కొత్తగా కేటాయించిన ఈఈలు, డీఈలు, ఏఈలు, జేఈలు, అధికారులను త్వరలో నియమించనున్నారు.త్వరలో చిత్తూరులో ఎస్‌ఈ కార్యాలయాన్ని ప్రారంభించి దానికి అధికారులు వేగంగా కసరత్తు చేపడుతున్నారు.


ఉపాధ్యాయుడు గంటా మోహన్ సస్పెన్షన్

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: నిబంధనలు అతిక్రమించి మాట్లాడటం, సంజాయిషీ లేఖకు ఇచ్చిన సమాధానం సంతృప్తిగా లేకపోవడంతో బంగారు పాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు గంటా మోహన్‌ను సస్పెండ్ చేశామని డీఈవో దేవరాజు బుధవారం తెలిపారు. ముందస్తు అనుమతి తీసుకోకుండా జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేయడం, తనను దూషిస్తూ మీడియాతో మాట్లా డినందుకు షోకాజ్ నోటీస్ జారీ చేశామన్నారు.

పండగపైనే బంతి రైతు ఆశలు

☛ 20 రోజులుగా గిట్టుబాటు ధర లేక నష్టాలు

☛ కోతల ఖర్చులు అందక అప్పులపాలు


రామసముద్రం వద్ద తోటలో పూలు కోస్తున్న కూలీలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: పండగలు, శుభకా ర్యాలు వస్తేనే పూల రైతులకు సంబరం. పండు గల సీజన్ రానుండని బంతిపూలు విస్తారంగా సాగు చేశారు. వినాయక చవితి మొదలు పండ గలు, శుభకార్యాలు వస్తే గిరాకీ వస్తుందని ఆశిం చారు. 20 రోజులుగా ధరలు పతనం కావడంతో కోతకు కూడా దక్కక నష్టాలు మూటగట్టుకున్నారు. కిలో రూ. 5 ధర పలకడంతో తోటల్లోనే వదిలే శారు. ఇలా తోటల్లో వదిలేసిన పూలు మచ్చలు ఏర్పడి పాడయ్యాయి. మచ్చ ఏర్పడిన వాటిని కోసి పారబోయాల్సిన పరిస్థితి. దసరాపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు.

ఎగుమతి లేక నష్టాలు.. పలమనేరు, కుప్పం, పుంగనూరు ప్రాంతాలు పూల సాగుకు అను కూలం. నియోజకవర్గాల పరిధిలో 2 వేల పైగా ఎకరాల్లో బంతి పూలు సాగు చేశారు. ఇక్కడి నుంచి విజయ వాడ, హైదరా బాదు, చెన్నై, బెంగళూరు నగరాలకు ఎగుమతి అవు తాయి. ఈ సీజన్‌లో భారీ వర్షాలు, వరదలతో నగరా లకు పూల ఎగుమతి పూర్తిగా నిలిచింది. పూల విక్రయాలు లేక గిరాకీ తగ్గింది. కిలో రూ.5 కూడా ధర లభించక రైతులు అప్పుల పాలయ్యారు. మార్కెట్‌లో పూలు విక్రయిస్తే కోత కూలీలు, రవాణా ఛార్జీలకే సరిపడక చేతి నుంచి పెట్టుకోవాల్సిన దుస్థితి. రెండురోజులుగా పూల ధరలు కాస్త పెరగడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ప్రస్తుతం కిలో రూ. 15-20 వరకు ధర పలుకుతోంది.




నష్టపోయా..: వినాయక చవితికి కిలో రూ. 25-30 మాత్రమే ధర పలికింది. మరుసటి రోజు నుంచే ధర పూర్తిగా పతనమైంది. 15 రోజుల క్రితం 30 బస్తాల (1200 కిలోలు) పూలు కోసి మార్కెట్‌కు తర లిస్తే బస్తా రూ. 50 చొప్పున అమ్ముడు పోయింది. పూలు నింపిన సంచి రూ. 40, రవాణా ఛార్జీ రూ.30, కోత కూలీలు రూ.150 చొప్పున బస్తాకు రూ. 220 ఖర్చు వచ్చింది. మార్కెట్లో రూ. 50 అమ్ముడంతో రవాణా ఛార్జీ, కూలీలకు చేతి నుంచి ఖర్చు చేయాల్సి వచ్చింది. రెండెకరాల్లో పూల సాగుకు రూ. 1.40 లక్షలు ఖర్చు చేశా. **- రంగనాయకులు, రైతు, రామసముద్రం**



పెట్టుబడి దక్కలేదు..: ఎకరం విస్తీర్ణంలో బంతి సాగు చేశా. 70 వేలు ఖర్చు చేశా. పూలు కోతకొచ్చే సమయానికి ధరలు పతనమయ్యాయి. కిలో రూ. 5 లభించక తోటలోనే వదిలేశా. తోటలో పూలు వదిలేయ డంతో నల్లమచ్చలు ఏర్పడింది. వీటి కోసి పార బోయడానికి అదనపు ఖర్చు భారంగా మారింది. కిలో రూ. 30 ధర పలికినా పెట్టు బడి చేతికి దక్కేది. **- రంజిత్, రైతు, కొత్తయిండ్లు**

వీణాపాణిగా బోయకొండ గంగమ్మ


సరస్వతీదేవిగా దర్శనమిస్తున్న బోయకొండ గంగమ్మ

బోయకొండ (చౌడేపల్లె): వీణాపాణి.. చదువుల రాణి నమోనమః అంటూ శక్తిస్వరూ పిణిని కీర్తిస్తూ భక్తులు అమ్మవారిని దర్శించు కున్నారు. శరన్నవరాత్రుల సందర్భంగా బోయకొండ గంగమ్మ బుధవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తుల దర్శనమిచ్చారు. అర్చ కులు మూలనక్షత్రంలో తెల్లని చీరతో అలంక రించి చేతిలో వీణ, జపమాల, కమండలం, పుస్తకాలను అలంకరించారు. నైవేద్యాలు సమ ర్పించి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. ఉభయదారులను ఈవో ఏకాంబరం ఆలయ మర్యాదలతో సత్కరించారు.

కాత్యాయనీదేవిగా మరగదాంబిక

కాణిపాకం: శ్రీ మరగదాంబిక సమేత శ్రీ మణికంఠేశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం రాత్రి అమ్మవారు కాత్యాయనీ దేవి అలం కారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూలవిగ్రహానికి పంచా మృతాభిషేకం నిర్వహించి భక్తులు సామూహిక కుంకుమార్చన నిర్వ హించారు. రాత్రి గ్రామోత్సవం జరి గింది. **బంగారు పాళ్యం:** వజ్రాల పురం బోయకొండ గంగమ్మ సరస్వ తీదేవి అలంకరణలో భక్తులకు దర్శ నమిచ్చారు.


▸ బంగారుపాళ్యం: సరస్వతీ దేవిగా..
▸ కాణిపాకం: కాత్యాయనీదేవి అలం కరణలో మరగదాంబిక

దరఖాస్తుల ఆహ్వానం

మహిళా వర్సిటీ (తిరుపతి): శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని ఇంటిగ్రేటెడ్, ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల కార్యా లయం సంచాలకురాలు సువర్ణలతాదేవి బుధవారం పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, బి.ఒకేషనల్ న్యూట్రిషన్ అండ్ హెల్త్‌కేర్ సైన్సెస్, ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ అప్పరల్ డిజైన్, బ్యాచిలర్స్ ఆఫ్ సైన్స్ ఇన్ స్టాటిస్టిక్స్, సోషల్ వర్క్, మాస్టర్స్ ఇన్ ఫైన్ ఆర్ట్స్ కోర్సుల్లో సీట్లు అందుబా టులో ఉన్నాయన్నారు. ఈ నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

టెట్‌కు 405మంది హాజరు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: టెట్‌ను జిల్లాలోని రెండు కేంద్రాల్లో బుధ వారం నిర్వహించగా 405మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 461మందికిగాను.. 405 మంది పరీక్ష రాశారు. అందులో ఎస్వీసెట్ కళాశాలలో 201కి.. 170మంది, మదర్ థెరెసా ఇంజినీ రింగ్ కళాశాలలో 260కి 235 మంది హాజరయ్యారు.

12న స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా ఈ నెల 12వ తేదీన స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు సంచాలకులు డాక్టర్ ఆర్వీ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలు యథాతథంగా ఉంటాయన్నారు. ప్రజలు, రోగులు సహకరించాలని కోరారు.


మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

ఫ్రీహోల్డ్ భూముల నివేదిక సమర్పించాలి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించిన సమగ్ర నివేదికను గురువారం సమర్పించాలని జేసీ విద్యాధరి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దా ర్లతో ఆమె మాట్లాడారు. తహసీల్దార్లు నివేదికను ఆర్డీవో ద్వారా కలెక్టరేట్‌లో అందించాలన్నారు. ప్రతి మండలంలో మొత్తం విస్తీర్ణం, లావాదేవీల దస్తావే జుల్ని పరిశీలించి ప్రొఫార్మా-4, 5ను పూరించి, ఎక్సెల్ షీట్‌లో అప్‌లోడ్ చేయా లన్నారు. కోర్టు కేసులు, డబుల్ ఎంట్రీలు, పీవోటీ.. ఇలా ఎలాంటి రిమా ర్క్స్ ఉన్నా చూపాలన్నారు. డీఆర్వో పుల్లయ్య, ఆర్డీవోలు శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మూర్ఛతో మెడకు చీర చుట్టుకుని బాలిక మృతి

పుత్తూరు, న్యూస్‌టుడే: ఇంట్లో ఆరేసిన చీర అభంశుభం తెలియని ఆ బాలిక పాలిట మృత్యువులా మారింది. మూర్ఛ రావడంతో మెడకు చీర చుట్టుకుని బాలిక మృతి చెందిన విషాద సంఘటన వడమాలపేట మండల పరిధిలో జరిగింది. పాదిరేడు ఆదిఆంధ్రవాడకు చెందిన వడ్డిపల్లి శేఖర్ కుమార్తె హేమాశ్రీ(11)కు కొన్నాళ్లుగా మూర్ఛవ్యాధితో బాధపడుతోంది. మంగళవారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుతుండగా అకస్మాత్తుగా ఆమెకు మూర్ఛ వచ్చింది. ఈ సమయంలో ఆరుబయట చీర ఆరేసి ఉండగా ప్రమా దవశాత్తూ తిరుగుతూ తిరుగుతూ వెళ్లి చీర మెడకు చుట్టుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గుర్తించిన కుటుంబీకులు ఆమెను వెంటనే చికిత్స కోసం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అసత్య వార్తలు ప్రచురించారంటూ కేసు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అసత్య వార్తలు ప్రచురించి, ప్రచారం చేసిన ఓ వార్తపత్రిక, ఛానల్‌పై పుంగనూరు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సెప్టెంబర్ 29న పుంగనూరులో అదృశ్యమై హత్యకు గురైన అస్వియా అంజుమ్ (7) ఘటనపై అసత్య వార్తలు ప్రచురించారని సాక్షి పేపరు, ఛానల్‌పై పట్టణానికి చెందిన అబ్బాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీల్లో చిత్తూరు ప్రథమం

దివాన్‌చెరువు (రాజానగరం): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పరిధిలోని దివాన్‌చెరువు శ్రీ ప్రకాష్ విద్యా నికేతన్‌లో మూడ్రోజులుగా నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల హ్యాండ్ బాల్ పోటీలు బుధ వారం ముగిశాయి. చిత్తూరు జిల్లా జట్టు ప్రథమ స్థానం, శ్రీకాకుళం జిల్లా జట్టు ద్వితీయ స్థానం, తూర్పు గోదా వరి జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించాయి. ముఖ్య అతిథులుగా హాజరైన నారాయణ, విజయప్రకాష్ విజేత లకు బహుమతులు అందజేశారు. పోటీల్లో ప్రతిభ కన బరిచిన 16 మంది క్రీడాకారులతో జాతీయ స్థాయిలో ఆడే జట్టును ఎంపిక చేశారు. చిత్తూరు జిల్లా నుంచి ముగ్గురు, శ్రీకాకుళం జట్టు నుంచి ఇద్దరు, తూర్పుగోదా వరి జట్టు నుంచి ఇద్దరు, విశాఖపట్నం జట్టు నుంచి ఒకరు, ప్రకాశం, విజయనగరం, కర్నూల్, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జట్టు నుంచి ఒకొక్కరు ఎంపికయ్యారు.



'వాహన్' సాఫ్ట్‌వేర్‌పై అవగాహన

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప జోన్ పరిధిలోని రవాణా శాఖ అధికారులు 'వాహన్' సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కలిగి ఉండాలని జేటీసీ కృష్ణవేణి పేర్కొన్నారు. కడప శివారులోని డీటీసీ కార్యాల యంలో ఎనిమిది జిల్లాల డీటీసీలు, ఆర్టీవోలు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కొత్తగా వచ్చిన సాఫ్ట్‌వేర్ వినియోగం, లోపాలపై అధికారులతో సమీక్షించారు. డీటీ సీలు చంద్రశేఖర్‌రెడ్డి(కడప), శాంతకుమారి(కర్నూలు), వీర్రాజు(అనం తపురం), నిరంజన్‌రెడ్డి(చిత్తూరు), ఆర్టీవోలు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

ఒత్తిడికి దూరంగా ఉండండి: వీసీ

చిత్తూరు (వైద్యవిభాగం): ప్రజలందరూ ఒత్తిడికి దూరంగా ఉంటూ ఆరోగ్యంగా జీవించాలని అపోలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ వినోద్‌భట్ తెలిపారు. చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో విశ్వవిద్యాలయంలో బుధవారం 'మెంటల్ హెల్త్ మ్యాటర్స్ ఎట్ వర్క్' అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఒత్తిడి ఎదుర్కొనే ఉద్యోగులు ధ్యానం, వ్యాయామం, సమయ పాలనపై దృష్టి పెట్టాలన్నారు. చిత్తూరు ప్రభుత్వాసుపత్రి మానసిక వైద్య నిపుణులు, ప్రొఫెసర్ దినేష్, ప్రముఖులు ఇండ్ల రామ సుబ్బారెడ్డి, జాన్ విజయ్‌సాగర్, సిబ్నాథ్ డేబ్ పాల్గొన్నారు.

నకిలీ నగలు కుదువపెట్టి మోసానికి పాల్పడిన ఆరుగురి అరెస్టు


అరెస్టయిన నిందితులు

తిరుత్తణి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చిత్తూరు జిల్లా విజయపురం మండలం మల్లారెడ్డి కండ్రిగకు చెందిన వెంకటయ్య, లత (48) భార్యాభర్తలు. లత.. కనకమ్మస త్రంలో రేఖ అనే మహిళకు చెందిన నగల కుదువ దుకా ణంలో గత నెల 22వ తేదీ 29 గ్రాముల బంగారు నగలను కుదువపెట్టి రూ.1.25 లక్షలు తీసుకుంది. మూడు రోజుల క్రితం అదే కుదువ దుకాణంలో 20 గ్రాముల నగలు కుదు వపెట్టి రూ.90 వేలు తీసుకుంది. అనుమానంతో దుకాణ యజమాని ఆ నగలను పరీక్షించగా నకిలీవని తెలిసింది. దీంతో కనకమ్మసత్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీ సులు కేసు నమోదు చేసి లతను అరెస్టు చేశారు. దర్యా ప్తులో పలు కీలక విషయాలు తెలియడంతో పూర్తిస్థాయి దర్యాప్తునకు తిరుత్తణి డీఎస్పీ శ్రీనివాస పెరుమాళ్ ఆదేశిం చారు. ప్రత్యేక పోలీసు బృందం అన్నమయ్య జిల్లా మదనప ల్లెకి చెందిన రామాం జనేయులు (50), పుత్తూరుకు చెందిన చంద్రశేఖర్ (39)ను అదుపులోకి తీసు కొని దర్యాప్తు జరిపింది. వారిద్దరూ గ్రామీణ ప్రాంతాల్లో వాయిదాల పద్ధతిలో గృహోపయోగ వస్తువులు, గోల్డ్ కవ రింగ్ నగలను విక్రయించి మహిళలతో పరిచయాలను పెంచుకున్నారని, డబ్బు ఆశచూపి వారి ద్వారా నకిలీ నగ లను ఆంధ్రప్రదేశ్, తమిళనాడులోని పలు కుదువ దుకా ణాల్లో, ప్రైవేటు బ్యాంకుల్లో కుదువపెట్టి కోట్లాది రూపా యలు తీసుకుని మోసానికి పాల్పడినట్లు తెలిసింది. ఇలా మోసానికి పాల్పడిన రేణిగుంటకు చెందిన హరిత (34), తిరుత్తణి సమీప వీకేఎన్ కండిగైకు చెందిన రేఖ (35)ను అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

14న అప్రెంటీస్ మేళా

చిత్తూరు విద్య: జిల్లాలోని కంపె నీల్లో అప్రెంటీస్ ఖాళీల భర్తీకి ప్రధా నమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా ఈ నెల 14న ఉదయం తొమ్మిది గంటలకు స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి బుధవారం తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఉత్తీర్ణత సాధించిన వారు అప్రెంటీస్ ఐబీఎం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకోనివారు నేరుగా ఐటీఐ కార్యాలయానికి వచ్చి నమోదు చేసుకోవచ్చన్నారు. వివరా లకు చరవాణి సంఖ్య 90306 57957ను సంప్రదించాలని ఆయన కోరారు.

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ప్రజలందరూ కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతీదేవి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా సబ్-యూనిట్ అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దోమలు పుట్ట కుండా, అవి కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామాల్లో నీటి నిల్వలు గుర్తించి.. వాటిని తొలగించాలన్నారు. ఇన్‌ఛార్జి జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు శాఖ గ్రీవెన్స్‌కు 30 వినతులు

చిత్తూరు(మిట్టూరు): విద్యుత్తు సమస్యలపై ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతి సర్కిల్ పరిధిలో ఎనిమిది డివిజన్లు, 27 సబ్-డివిజన్ కార్యాల యాల్లో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 30 సమస్యలపై వినతులు వచ్చాయని ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. స్తంభాలు, లైన్ల మార్పు, అధిక బిల్లింగ్, మీటర్ల మార్పు తది తర సమస్యలు ప్రస్తావించారన్నారు. 24 ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించామని, ఆర్థికపరమైన ఆరు సమస్యల పరిష్కారానికి నివేదిక సమర్పించాలని ఇంజినీర్లను ఆదేశిం చామని ఎస్ఈ పేర్కొన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	124
రిటైల్	146
లేయర్	110
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	241
లేయర్ మాంసం	187

డీఎఫ్వోగా భరణి



చిత్తూరు(జిల్లా పంచాయతీ): జిల్లా అట వీశాఖ అధికారిణిగా భరణి బుధవారం బాధ్య తలు స్వీకరించారు. ఆమె కాకినాడ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. జిల్లాపై తనకు కొంత అవగాహన ఉందని, ఇంకా పూర్తిగా అవగాహన పొంది, అటవీ సంరక్షణకు కృషి చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రాగిపాత్రకు మహిమలున్నాయంటూ మోసాలు

ముగ్గురి అరెస్ట్, రూ.25లక్షల నగదు స్వాధీనం

ఈనాడు, హైదరాబాద్-రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: తమ వద్ద ఉన్న పురాతన రాగిపా త్రకు అద్భుత మహిమలున్నాయంటూ మోసా లకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.25లక్షల నగదు, రాగిపాత్ర, 7 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం డీసీపీ వై.వి.ఎస్.సుధీంద్ర వివరాలు తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన శివసంతోష్, చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన జి.మంజునాథ్ రెడ్డి, బెంగళూరుకు చెందిన ప్రతాప్ ముఠాగా ఏర్పడి రైస్‌పుల్లింగ్ పేరిట మోసాలకు పాల్పడు తున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన శశికాంత్‌కు మిత్రుడి ద్వారా మంజునాథ్‌రెడ్డి పరిచయమ య్యాడు. తాను రైస్‌పుల్లింగ్ యంత్రంతో రూ.10 కోట్లు లాభపడినట్టు మంజునాథ్‌రెడ్డి అతడికి వివరించాడు. దాన్ని కొనేందుకు చాలామంది పోటీపడుతున్నారని తన పలుకుబడితో సొంత మయ్యేలా సహకరిస్తానంటూ భరోసానిచ్చాడు. కొద్దిరోజుల తరువాత శశికాంత్‌కు ఎస్‌డీరోడ్‌లోని ఓ హోటల్‌లో శివసంతోష్‌ను పరిచయం చేశాడు. తన వద్ద ఉన్న రాగిపాత్ర శక్తిని తెలు సుకునేందుకు డీఆర్‌డీవో రూపొందించిన స్కానర్ ద్వారా పరీక్షించుకోవచ్చని సలహా ఇచ్చాడు. డీఆర్‌డీవో శాస్త్రవేత్తగా ప్రతాప్‌ను రంగంలోకి దింపి పరిచయం చేశారు. స్కానర్‌పై పరీక్షించేం దుకు అడ్వాన్స్‌గా ఈనెల 6న రూ.25లక్షలు తీసు కున్నారు. శశికాంత్ రాగిపాత్ర గురించి అడిగితే మరో రూ.25లక్షలు కావాలంటూ మెలికపెట్టారు. అనుమానం వచ్చిన బాధితుడు మహంకాళి పోలీ సులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టి ముగ్గు రిని అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి రూ.2కోట్లు, కరీంనగర్ నివాసి రూ.40 లక్షలు, నిజామాబాద్‌లో ఉంటున్న ఒకరు రూ.10 లక్షలు ఈ ముఠా చేతిలో మోసపోయినట్టు పోలీ సులు దర్యాప్తులో గుర్తించారు. విజయవాడ, గుంటూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పెద్ద ఎత్తున బాధితులున్నట్టు అంచనా వేస్తున్నారు. ఈ ముఠా పురాతన రాగిపాత్రలో మహిమలున్నా యంటూ అందులో రసాయనం ఉంచి బియ్యం పోసేవారు. కొంత సమయానికి అవి పచ్చరంగు లోకి మారటంతో తేలికగా నమ్మేవారు.


అరెస్టయిన నిందితులు శివసంతోష్, మంజునాథ్‌రెడ్డి, ప్రతాప్. చిత్రంలో స్వాధీనం చేసుకున్న నగదు, రాగిపాత్ర

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి



అవగాహన కల్పిస్తున్న కోర్టు సిబ్బంది

బాలలను పనిలో పెట్టుకుంటే నేరం

పుత్తూరు, న్యూస్‌టుడే: దుకాణాలు, హోటళ్లు, ఇతర వాణిజ్య సముదాయాల్లో 14 ఏళ్ల లోపు పిల్లల్ని పనిలో పెట్టుకుంటే నేరమని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. ఆయన ఆదేశాల మేరకు కోర్టు సిబ్బంది కార్మికశాఖ, ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి బుధవారం దుకాణాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

12న శ్రీవారి కల్యాణోత్సవం

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: శ్రీవారి కల్యాణోత్సవాన్ని ఈ నెల 12న నిర్వహించనున్నట్లు శ్రీ వెంకటేశ్వర తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద ట్రస్ట్ సభ్యులు ఈశ్వర్ బుధవారం తెలిపారు. కట్టమంచిలోని శాంతాకోదండరామ కల్యాణ మండపంలో ఈ వేడుక జరగనుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

సమస్య: స్థానిక వన్నియర్ బ్లాక్‌లో డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టలేని సమస్య విజ్ఞప్తి చేశారు. కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో..దోమలు, దుర్వాసన ఎక్కువగా ఉంటోందని తెలిపారు.

సమాధానం: కాలువల్లో పూడికతీత పనులు చేయిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తాం.

- అనిల్ కుమార్, నగరపాలక ఆరోగ్యాధికారి

న్యూస్‌టుడే, గుడిపాల

సమస్య: పాపసముద్రం ఎస్సీకాలనీ వద్ద రోడ్డు కిరుప్రక్కల నిలిచిన మురుగునీటిని తొలగించాలి. ఇదివలే వర్షాలకు అంటురోగాలు వస్తాయోనని ఆందోళనగా ఉంది.

- విల్సన్, స్థానికుడు

సమాధానం: సమస్యను స్థానిక పంచాయతీ కార్యదర్శి సర్పంచి దృష్టికి తీసుకెళ్లి మురుగునీటి నిల్వలు తొలగింపజేస్తాం. **- కృష్ణప్రసాద్, పంచాయతీ విస్తరణాధికారి, గుడిపాల**

యాదమరి, న్యూస్‌టుడే

సమస్య: యూనియన్ బ్యాంకు నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే దారి బురదమయమైంది. అటుగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. **- స్థానికులు**

సమాధానం: వెంటనే బురదను తొలగిస్తాం. మట్టిని తోలి రోడ్డును బాగు చేస్తాం.

- సుందరేశన్, కార్యదర్శి, యాదమరి

విద్యుత్తుశాఖ గ్రీవెన్స్‌కు ఐదు వినతులు


చిత్తూరు అర్బన్ డివిజన్‌లో వినతులు స్వీకరిస్తున్న డీఈఈ ప్రసాద్

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యలపై చిత్తూరు అర్బన్ డివిజన్‌లో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఐదు సమస్యలపై వినతులు వచ్చాయని ఈఈ మునిచంద్ర తెలిపారు. స్తంభాలు, లైన్ల మార్పు, అధిక బిల్లింగ్, మీటర్ల మార్పు తదితర సమస్యలు ప్రస్తావించారన్నారు. మూడు ఆర్థికేతర సమస్యలు వెంటనే పరిష్కరించామని, ఆర్థికపరమైన రెండు సమస్యల పరిష్కారానికి నివేదిక సమర్పించాలని ఇంజినీర్లను ఆదేశించామన్నారు. డీఈఈలు ప్రసాద్, ఆనంద్, ఏఈలు రాజా, అధికారులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి: కమిషనర్


స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: నగర శివారు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ సూచించారు. స్థానిక 21వ డివిజన్ పరిధిలోని గాండ్లకొత్తూరు, లక్ష్మయ్య కండిగ, రామభద్రాపురం ప్రాంతాల్లో పర్యటించిన ఆయన.. స్థానిక సమస్యల్ని ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, నీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. స్థానిక తెదేపా నాయకులు లక్ష్మీపతి, ప్రభాకర్, బాలాజీ, సుభాష్ పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్ల వితరణ.. చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: సత్యసాయి సేవా సమితి మాస నారాయణ సేవలో భాగంగా సేవా దళ్ సభ్యులు బుధవారం నగరంలోని దీనులు, ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులు, సహాయకులు మొత్తం 165 మందికి భోజన ప్యాకెట్లు, పండ్లు, ఆహార పదార్థాల్ని వితరణ చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యంరెడ్డి.. కార్వేటినగరం: కృష్ణాపురం జలాశయం మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా ఏఎంఆర్ కండ్రిగకు చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి ఎన్నికైనట్లు ఎన్నిల అధికారి పుల్లయ్య బుధవారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా నాగరాజరెడ్డి, కార్యదర్శిగా మురుగేష్ ఎన్నికయ్యారని ఆయన పేర్కొన్నారు.


గొల్లపల్లి వద్ద రహదారిపై గోతులు


కొత్తూరు వద్ద ఇలా..


జోడిచింతల పోలీస్‌స్టేషన్ సమీపంలో బావిలా..

రహదారుణం

- అంతర్రాష్ట్ర రహదారిలో నిత్య నరకం
- ప్రతిపాదనలకే పరిమితం

- కాశిరాళ్ల కొత్తూరుకు చెందిన ఇనుపోలుశెట్టి జోడిచింతల విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తూ గోతిలో పడి ప్రాణాలు కోల్పోయారు.
- తమిళనాడు పరదరామికి చెందిన మహిళ ఓటేరుపల్లి సమీపంలో గుంత కారణంగా ద్విచక్ర వాహనంపై నుంచి పడి తీవ్రగాయాలై మృతి చెందింది.

న్యూస్‌టుడే, చిత్తూరు(జిల్లా పంచాయతీ, యాదమరి)

రాష్ట్రంలోనే అత్యంత ప్రమాదకరమైన దారి ఏదైనా ఉందంటే అది చిత్తూరు గడియాత్తం అంతర్రాష్ట్ర రహదారే.. గజానికో గుంతగా మారింది.. వైకాపా పాలకుల నిర్లక్ష్యంతో గత ఐదేళ్లు తట్ట మట్టి వేయక తారు, కంకర తేలిపోయి గోతులమయమైంది.. ఈ దారిలో పలువురు ప్రాణాలు కోల్పోగా, ఎంతోమంది క్షతగాత్రులయ్యారు.. నేతల మాటలు తప్ప రహదారి బాగుపడింది లేదు.. సమస్య కలెక్టర్‌కు, ప్రభుత్వ ఉన్నతాధికారులకూ తెలుసని, నిధులు మంజూరైతే గానీ తాము చేయగలిగిందేమీ లేదని ఆర్‌అండ్‌బీ అధికారులు చేతులెత్తేస్తున్నారు.

రూ.42 లక్షలు గుంతల పాలు..

గతేడాది వైకాపా ప్రభుత్వ పాలనలో జోడిచింతల పోలీసుస్టేషన్ నుంచి కన్నికాపురం రాష్ట్ర సరిహద్దు వరకు గుంతలు పూడ్చేందుకు రూ.42 లక్షలు మంజూరవగా నాటి ఎమ్మెల్యే బాబు.. నాయకులతో కలిసి స్టేషన్ సమీపంలో ఆర్భాటంగా పనులు ప్రారంభించారు. కాశిరాళ్ల వరకూ పైపైన గోతులు పూడ్చి నాసిరకంగా తారు వేశారు. రోజుల వ్యవధిలోనే గుంతలు తేలాయి. 2.5 కిమీ దూరం మాత్రమే పనులు మమ అనిపించి గుత్తేదారు, నాయకులు కలిసి రూ.లక్షలు దోచుకున్నారనే ఆరోపణలు ఉనాయి.

తెదేపా పాలనలో వేసిన రోడ్డే నేటికీ..

2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఇరువారం సమీపం నుంచి జోడిచింతల వరకూ కొత్త రహదారి నిర్మించింది. 2019లో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాష్ట్ర సరిహద్దు వరకు నిర్మించలేదు. పోలీసుస్టేషన్ వరకూ రోడ్డు బాగానే ఉన్నా అక్కడి నుంచి కన్నికాపురం సరిహద్దు వరకూ 8.5 కిలోమీటర్లు దారుణంగా మారింది. ఇటీవల పత్రపల్లి వద్ద లారీ గుంతలో ఇరుక్కుని ట్రాఫిక్ స్తంభించింది. తారు పూర్తిగా తేలి, కంకర లేక ఎండ కాస్తే దుమ్ము, వానొస్తే బురదగా మారి ప్రజలకు నరకం చూపుతోంది. దీన్ని బాగుచేయాలని ర.భ.శాఖ మంత్రికి.. ఎమ్మెల్యే మురళీమోహన్ విన్నవించారు. అధికారులు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. నిధులొస్తే తప్ప చేసేదేమీ లేదని సంబంధిత అధికారి స్పష్టం చేశారు.

తమిళనాడు అధికారుల చొరవ..

నిత్యం ఇటుగా వందలాది భారీ వాహనాల సరకు రవాణాతో తమిళనాడు సరిహద్దు తనిఖీ కేంద్రాలకు ఆదాయం పెద్దమొత్తంలో అందుతుంది. గుంతల కారణంగా రాకపోకలు తగ్గి వారి ఆదాయానికి గండిపడింది. తమిళనాడు తనిఖీ కేంద్ర సిబ్బంది రూ.20 వేలు స్థానిక నేతలకు ఇచ్చి గోతులకు మట్టి తోలించాలని కోరగా ఇటీవల సరిహద్దు నుంచి ఇటుగా కొద్ది దూరం మట్టి తోలారు. ఆరోజు రాత్రే భారీ వర్షంతో మట్టి కాస్తా బురదగా మారి సమస్య జటిలమైంది. ఇదేమని ఆర్‌అండ్‌బీ అధికారులను అడిగితే తమ అనుమతి లేకుండా మట్టి వేయరాదని, ఒకవేళ ప్రశ్నిస్తే తమపై ప్రజలే తిరగబడే పరిస్థితి ఉన్నందున నిస్సహాయంగా ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

తొలగిన చెత్తాచెదారం

మండలంలోని క్రిష్ణజిమ్మాపురం పంచాయతీ బలిజ కండ్రిగ కూడలిలో చెత్తాచెదారంపై బుధవారం 'ఈనాడు'లో 'మేమున్నాం మీకుతోడుగా' శీర్షికన సమస్య ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో విద్యావతి, ఈవోఆర్డీ రమేష్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ జేసీబీల సహాయంతో అక్కడ శుభ్రం చేయించారు.

-న్యూస్‌టుడే, పాలసముద్రం

స్పందనకు వందనం

మట్టి కుప్ప తొలగింపు

పెనుమూరు-చిత్తూరు మార్గంలో ఈత మాకులకుంట కట్టపై రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తులు మట్టి తెచ్చి ప్రమాదకరంగా పోశారు. దీనిపై 'ప్రమాదకరంగా మట్టికుప్పలు' శీర్షికన 'ఈనాడు'లో ఇటీవల వార్త ప్రచురితమైంది. స్పందించిన ఓ యువకుడు జేసీబీ సాయంతో మట్టికుప్ప చదును చేసి ప్రమాదాన్ని నివారించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, పెనుమూరు**






కలెక్టరేట్: మహిషాసురమర్దినిగా గిరింపేట దుర్గాంబ • సంతపేట: చండీమాత సేవలో భక్తులు • చిత్తూరు(క్రీడలు): పొన్నియమ్మన్ ఆలయంలో సరస్వతీదేవిగా .. • తవణంపల్లె: దిగువమాఘంలో సరస్వతీదేవి అలంకరణలో అన్నపూర్ణాదేవి

చదువుల తల్లి.. సరస్వతీ దేవి

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాలు నగరంలోని ఆలయాల్లో వైభవంగా సాగుతున్నాయి. స్థానిక సంతపేటలోని జీజేఎం సుభిభవ హాల్‌లో చండీహోమం ఏడో రోజైన బుధవారం శాస్త్రోక్తంగా జరిగింది. ఎమ్మెల్యే జగన్‌మోహన్ సతీమణి గురజాల ప్రతిమ పాల్గొన్నారు.




చిత్తూరు గ్రామీణ: బీఎన్‌ఆర్‌పేటలో సీతా సమేత రామలక్ష్మణులు • పుత్తూరు: విశేష అలంకరణలో ఓంశక్తి అమ్మవారు • పుత్తూరు: ధనలక్ష్మి అలంకరణలో మానసాదేవి


• పుత్తూరు: సరస్వతీదేవి అలంకరణలో శ్రీద్రౌపదీదేవి • నగరి: సరస్వతి అలంకరణలో కామాక్షీదేవి • నగరి: సరస్వతీ దేవి అలంకరణలో దేశమ్మ • పెనుమూరు: సి.రామాపురంలో వీణాపాణిగా ప్రసన్న పార్వతీదేవి


శ్రీరంగరాజపురం.. ఆరిమాను గంగమ్మకు పట్టువస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే థామస్



• జీడీనెల్లూరు: గరుడ వాహనంపై లక్ష్మీనారాయణస్వామి • కార్వేటినగరం: సరస్వతీదేవి అలంకరణలో బంగారమ్మ

భూ ఆక్రమణలు జరగకుండా చూడాలి

వెదురుకుప్పం, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ సమస్యలపై ప్రజలు వచ్చే అర్జీలు వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. అదే సమయంలో మండల పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని తహసీల్దారు రమేష్‌బాబును ఆదేశించారు.

బాధ్యతల స్వీకరణ


మోహన్‌వల్లి

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: చిత్తూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయ(ఆర్డీవో) పరిపాలనాధికారిణిగా మోహన్‌వల్లి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పలమనేరు ఆర్డీవో కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను ఆ కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందించారు.

శ్రీరంగరాజపురంలో..


లోకనాథ పిళ్లై

శ్రీరంగరాజపురం: నూతన తహసీల్దారుగా లోకనాథ పిళ్లై బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడే డీటీగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించారు. **పెనుమూరు:** చిన్నమరెడ్డికండ్రిగ, తాటిమాకులపల్లె పంచాయతీల కార్యదర్శులుగా సురేఖ, వెంకటేష్ బాధ్యతలు చేపట్టారని ఎంపీడీవో తెలిపారు.

పుత్తూరులో.. పుత్తూరు, న్యూస్‌టుడే: నూతన ఎంపీడీవోగా రమేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.


రమేష్‌బాబు



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతీదేవి

చిన్న వయస్సులో వివాహాలు వద్దు

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: చిన్న వయస్సులో వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని, 18 సంవత్సరాలు దాటాకనే యువతులకు వివాహం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతీదేవి తెలిపారు. చిత్తూరులోని పోలీసు శిక్షణ కేంద్రంలో మహిళా పోలీసులకు పీసీపీఎన్‌డీటీ చట్టంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వయస్సు నిండకుండా వివాహం చేస్తే ఆ జంట జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకోరని, అనర్థాలకు దారితీస్తుందన్నారు. చిన్న వయస్సులో గర్భం ప్రాణానికి హానికరమని, మాతాశిశు మరణాలకు అవకాశం ఉందన్నారు. ఐసీడీఎస్ పీడీ హైమావతి, ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ శిరీష, పలమనేరు సీడీపీవో వాణి, లీగల్ అధికారి వెంకటేశులు పాల్గొన్నారు.

నలుగురు స్మగ్లర్ల అరెస్ట్

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బలగాలు చిత్తూరు సమీపంలోని సంతపేట అటవీ ప్రాంతంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో నలుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. ఆర్ఎస్సైలు కె.సురేష్‌బాబు, వై.విశ్వనాథ్ బలగాల ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. 11 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు.


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, అదుపులోకి తీసుకున్న స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ బలగాలు

వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడిగా ఖాదర్ బాషా

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: వీఆర్‌ఏల సంఘ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా అధ్యక్షుడు కోదండన్ సమక్షంలో తహసీల్దారు కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఖాదర్ బాషా, గౌరవాధ్యక్షుడిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్, కోశాధికారిగా జీవరత్నం, కార్యదర్శిగా నాగరాజు ఎన్నికయ్యారు.

సీపీఎం మహాసభలు విజయవంతం చేయాలి

నింద్ర, న్యూస్‌టుడే: ఈ నెల 26, 27 తేదీల్లో జిల్లా కేంద్రంలో జరగనున్న జిల్లా స్థాయి సీపీఎం మహాసభలు విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన అవగాహన ర్యాలీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాయకులు ఓబుళ్‌రాజు, చిరంజీవమ్మ పాల్గొన్నారు.

ప్రాంతీయ ఆసుపత్రి తనిఖీ

నగరి, న్యూస్‌టుడే: ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిని డీసీహెచ్‌ఎస్ ప్రభావతి బుధవారం సందర్శించారు. అక్కడి అన్ని రికార్డులు తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందితో ఆమె సమావేశమై పలు అంశాలపై ఆమె చర్చించారు. ఆసుపత్రిలో అవసరమైన వసతులు, ప్రస్తుతం ఉన్నవాటిని పరిశీలించారు. సూపరింటెండెంట్ జరీనా, ఆర్ఎంవో కార్తికేయన్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. **గుడిపాల:** ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది 24 గంటలు రోగులకు అందుబాటులో ఉండాలని జిల్లా టీకాల అధికారి హనుమంతరావు ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో కాన్పులు ఎక్కువగా చేయించాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. చిన్న పిల్లల టీకా వంద శాతం పూర్తిచేయాలన్నారు. ల్యాబ్, ఇంజెక్షన్లు, కాన్పుల గదిని పరిశీలించారు. వైద్యాధికారి సంధ్య, హెచ్ఎస్ రవి, జిల్లా సూపర్‌వైజర్ విజయ ఉన్నారు.


నగరి: వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ ప్రభావతి

ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడి

పుత్తూరు: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో కోదండయ్య పేర్కొన్నారు. కైలాసపురం, నందిమంగళం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఉద్యానశాఖాధికారి వెంకటసౌజన్య, అగ్రికల్చరల్ అసిస్టెంట్ సెల్వం, రైతులు పాల్గొన్నారు.


గొల్లపల్లి వద్ద డంప్ చేసిన మట్టి

అంతా అనధికారమే..

- పేట్రేగిన మట్టి మాఫియా
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

న్యూస్‌టుడే, పుత్తూరు

మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకు పేట్రేగిపోతున్నాయి.. నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదు.. అనధికారికంగా ఎర్రమట్టి తరలించి ఇటుకలు తయారు చేస్తున్న వారికి గతంలో అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు.. దీంతో వారి ఆగడాలకు అంతే లేకుండా పోతోంది.. ఇష్టానుసారంగా మట్టి తరలిస్తున్నా ఆలకించే నాథుడే కరవయ్యాడు.

దర్జాగా వ్యాపారం..

నగరి నియోజకవర్గం తమిళనాడు సరిహద్దు కావడంతో ఇటుకల వ్యాపారం బాగా సాగుతోంది. తమిళనాడులో ఇసుక, గ్రావెల్, కంకర, మట్టి తరలింపుపై నిషేధం ఉండటంతో అక్కడి వ్యాపారులు ఇక్కడ స్థలాలు లీజుకు తీసుకుని ఇటుకల బట్టీలు ఏర్పాటు చేశారు. ఒక్క పుత్తూరు మండలంలోనే 25 నుంచి 30 వరకు ఉన్నాయి. గోపాలకృష్ణాపురం, విద్యుత్తు సదాశివపురం, వేణుగోపాల్‌సాగర్, నేషనూరు అటవీ ప్రాంతం నుంచే అక్రమార్కులు మట్టి తరలించి రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. స్థానికంగా పలుకుబడి ఉన్న నేతల కనుసన్నల్లోనే ఇదంతా సాగుతోంది. దీన్ని ప్రశ్నించాల్సిన రెవెన్యూ, మైన్స్ అధికారులు పట్టించు కోవడంలేదు. తిరుపతి-చెన్నై జాతీయ రహదారికి కూతవేటు దూరంలోనే ఈ దందా సాగుతున్నా, ప్రకృతి సంపద తమిళనాడుకు తరలుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

విధిగా అనుమతి ఉండాలి..

మట్టి తరలించాలంటే రెవెన్యూ, మైన్స్ అధికారులు అనుమతి తీసుకోవాల్సి ఉన్నా అలా లేకుండానే దర్జాగా తరలిస్తున్నారు. వారిపై కేసులు నమోదు చేయాల్సిన అధికారులు నిద్ర నటిస్తున్నారు. ఇటుకల వ్యాపారులు మట్టి తీసుకురావడం. . ఇటుకలు తయారుచేసి యథేచ్ఛగా అమ్ముకుంటున్నారు. ఈ తంతు నిరాటంకంగా సాగుతోంది. ఇక్కడ తయారుచేస్తున్న ఇటుకలు తమిళనాడుకు తరలిస్తున్నారు. అయితే అధికారులు అటువైపు కన్నెత్తి చూడటంలేదు. ప్రకృతి సంపద నాశనం చేస్తున్నా ఎవరికీ పట్టడంలేదు.

నోటీసులతో సరి..

గతంలో బట్టీల యజమానులకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. మట్టి కొలతలు తీసి క్యూబిక్ మీటర్ల లెక్కన చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అనంతరం రాజకీయ నేతల నుంచి ఒత్తిళ్లు రావడంతో పట్టించుకోవడం మానేశారు. ఈ నేపథ్యంలో విచ్చలవిడిగా బట్టీల వ్యాపారులు మట్టి తరలించి ఇటుకలు చేసి సరిహద్దులు దాటించేస్తున్నారు. కారణం తమ వెనుక రాజకీయ నేతలు ఉన్నారని చెబుతుండటమే.

మట్టి తరలిస్తే చర్యలు..

అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు తప్పవు. ఒకవేళ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటాం. తరచూ తనిఖీలు చేసి అడ్డుకుంటాం.

- ప్రతాప్, గనులశాఖ అధికారి, తిరుపతి జిల్లా

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన రవికుమార్.. పెనుమూరు, న్యూస్‌టుడే: తెలంగాణ కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు మహేశ్వర్‌గౌడ్‌ను రాష్ట్ర కాంగ్రెసు వోబీసీ విభాగ మాజీ ఉపాధ్యక్షుడు బి.రవికుమార్ బుధవారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు కాణిపాకం వినాయకస్వామి ప్రతిమ అందజేశారు. తెలంగాణ కాంగ్రెసు నుంచి ఏపీలో పార్టీ పటిష్ఠతకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు పూర్తి సహకారం అందిస్తామని ఆయన చెప్పారని రవికుమార్ తెలిపారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంకు సత్కారం.. జీడీనెల్లూరు, న్యూస్‌టుడే: వెలుగు ఏపీఎంగా బుధవారం బాధ్యతలు చేపట్టిన ఫరీద్ మస్తాన్‌ను తెదేపా నేతలు స్వామిదాస్, వెంకటేష్, దేవసుందరం, చిదంబరం, జాన్, సతీష్ సత్కరించారు. అర్హులైన డ్వాక్రా సంఘానికి రుణాలు ఇప్పించాలని వారు ఆయన్ను కోరారు.

మద్యం పట్టివేత

యాదమరి, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని యాదమరి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని వరిగపల్లి వద్ద బుధవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు టాటా ఏస్ వాహనంలో మద్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితుల్లో ఒకరు పారిపోయారు. ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఈశ్వర్ తెలిపారు. మద్యం విలువ రూ.లక్ష ఉంటుందని పోలీసులు వెల్లడించారు.

బిల్లులు లేని ఇసుక లారీకి జరిమానా

పాలసముద్రం, న్యూస్‌టుడే: జీడీనెల్లూరు నుంచి అక్రమంగా మండలం మీదుగా వస్తున్న ఇసుక లారీని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. బిల్లులు లేకపోవడంతో పోలీసులు తహసీల్దార్‌కు అప్పగించగా జరిమానా విధించారు.

గ్రానైట్ లారీ స్వాధీనం

కాణిపాకం, న్యూస్‌టుడే: కాణిపాకం పోలీస్‌స్టేషన్ పరిధిలో రికార్డులు లేని అక్రమ గ్రానైట్ లారీని స్వాధీనం చేసుకుని భూగర్భ గనులశాఖకు అప్పగించామని ఎస్సై ధరణీధర్ బుధవారం తెలిపారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

విద్యార్థుల సంఖ్య పెంచాలి

కల్లూరు, న్యూస్‌టుడే: ఉన్నత పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని, ఇందుకు తగ్గట్టుగా విద్యార్థుల సంఖ్య పెంచుకునేందుకు కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్షా అదనపు సంచాలకులు వెంకటరమణారెడ్డి సూచించారు. బుధవారం కల్లూరు హైస్కూల్లో పీఎం శ్రీ స్కూల్ కార్యక్రమం కింద రూ.4లక్షలతో చేపట్టిన ఆటస్థలం అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎంఈవో సిద్ధరామయ్య, ఉపాధ్యాయులు రాజశేఖర్, రాజేంద్ర పాల్గొన్నారు.



ఎంఈవో సిద్ధరామయ్యతో మాట్లాడుతున్న ఏపీడీ వెంకటరమణారెడ్డి

తాళిబొట్ల వితరణ.. చౌడేపల్లె: మండలంలోని ఎ.కొత్తకోట పంచాయతీ ఎస్.అగ్రహారంలో వెలసిన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆ గ్రామానికి చెందిన ఆనందాచార్యులు, చాముండేశ్వరి.. రుక్మిణి, సత్యభామకు తాళిబొట్లను వితరణగా అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) పలమనేరు: 80085 74580 కుప్పం పట్టణం: 80085 73490 పుంగనూరు: 80085 74622

శాంతిపురం, న్యూస్‌టుడే:

సమస్య: మండల పరిధి ఏడోమైలు- రాళ్లబూదుగూరు రెండు వరుసల రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో వాహనదారులకు అసౌకర్యం ఎదురవుతోంది. మలుపుల్లో సూచికలు కనిపించడంలేదు.

- శ్రీనివాసులురెడ్డి, చిన్నూరిదొడ్డి

సమాధానం: వెంటనే పరిశీలించి రహదారికి ఇరువైపుల శుభ్రం చేయిస్తాం.

- కృష్ణానాయక్, ఏఈ, ఆర్అండ్‌బీ




ఎమ్మెల్సీకి విరాళం చెక్కు అందజేస్తున్న నాయకులు

వరద బాధితులకు రూ.65 వేల విరాళం

శాంతిపురం, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం మండల పరిధి 64- పెద్దూరు పంచాయతీ సోమాపురానికి చెందిన తెదేపా నాయకులు శ్రీనివాసులు, వెంకటస్వామి, సురేంద్ర, మురళి తదితరులు రూ.65 వేల విరాళాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు బుధవారం అందజేశారు. వారి వెంట మండల నాయకులు పాల్గొన్నారు. **నిత్యావసరాలు..:** కుప్పం పట్టణం: విజయవాడ వరద బాధితులకు సాయిమాతాసేవాట్రస్టు ఆధ్వర్యంలో కుప్పం ప్రాంతంలో సేకరించిన నిత్యావసరాలను ప్రత్యేక బస్సులో పంపారు. బుధవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం జెండా ఊపి ప్రారంభించారు. ట్రస్టు వ్యవస్థాపకులు జగదీష్‌బాబు పాల్గొన్నారు.

బోయకొండ అభివృద్ధికి సీఎం చొరవ చూపాలి

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: శక్తిక్షేత్రం బోయకొండ అభివృద్ధికి సీఎం చంద్రబాబు చొరవ చూపాలని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం బోయకొండ గంగమ్మకు ఎమ్మెల్యే దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. పూజలు, అమ్మవారి దర్శనం తర్వాత ఆయన విలేకర్లతో మాట్లాడారు. కూటమిలోని చిన్న నాయకులు తప్పులు చేశారని.. వాటిని సరిదిద్దుకుని సాగాలన్నారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, బోయకొండ మాజీ అధ్యక్షుడు శంకరనారాయణ పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు

అంబేడ్కర్ విగ్రహ స్థల వివాదంపై విచారణ

నడుం, న్యూస్‌టుడే: మండలంలోని అమ్మగారిపల్లె పంచాయతీ కలకటవారిపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహ స్థల వివాదంపై అధికారులు బుధవారం ప్రజలనుంచి అభిప్రాయాలు సేకరించారు. కలకటవారిపల్లెకు దళితవాడకు చెందిన ఓ వర్గం రామాలయం ఎదుట అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. మరో వర్గం వ్యతిరేకిస్తూ అక్కడ తొలగించాలని కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు తహసీల్దార్ మారుతీప్రసాద్, ఎస్సై పేరోహవలి, ఏవో హరిబాబు దళిత సంఘం నాయకుల ఆధ్వర్యంలో అభిప్రాయాలు సేకరించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

కరి భయం.. డ్రోన్ అభయం



ఏనుగుల సంచారం గుర్తించేందుకు డ్రోన్ ఎగురవేస్తున్న అధికారులు

- ◆ వినూత్నంగా ఏనుగుల గుర్తింపు
- ◆ అడవిలోకి మళ్లింపు.. రైతులు అప్రమత్తం
- ◆ పంటల పరిహారంలో అంతులేని జాప్యం

కల్లూరు, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రాంత, కౌండిన్య పరిసర ప్రాంత రైతులకు ఏనుగుల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్రామ శివారు, అటవీ ప్రాంత సమీపంలోని పంటలపైపడి దాడులు చేస్తూ అపార నష్టాన్ని కలిగిస్తున్నాయి. పలుమార్లు గ్రామాల్లోకి చొచ్చుకొచ్చి ఇళ్లు కూల్చిన ఘటనలు, అమాయకుల ప్రాణాలు తీసిన ఉదంతాలు ఉన్నాయి. పంటలు చేతికొచ్చే సమయంలో ఏనుగుల దాడులు మొదలయ్యాయి. వైకాపా పాలనలో వాటిని నియంత్రించకుండా పూర్తిగా నిర్లక్ష్యమైన అటవీశాఖ ప్రస్తుతం నూతన విధానాలను అమలు చేస్తోంది. ప్రాణనష్టం నివారణకు చర్యలు చేపడుతుంది.



టమాటా పంట కాపాడుకునేందుకు విద్యుత్ దీపాల అమరిక

చేష్టలుడిగి చూస్తుండిపోయారు. తూర్పు విభాగం అధికారులు పడమర వైపునకు, పడమర విభాగం అధికారులు తూర్పు వైపునకు మళ్లించడం తప్ప ఎలాంటి పనులు చేయలేదు. కూటమి ప్రభుత్వం రాగానే శాశ్వత చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా డ్రోన్ కెమెరాలతో ఏనుగుల మందను గుర్తించి.. అవి పయనించే గ్రామాల రైతులను అప్రమత్తం చేస్తున్నారు. ఇటీవలే పులిచెర్ల మండలంలో 16 ఏనుగుల గుంపును ఈ విధంగానే గుర్తించారు.

ఇక్కడే అధికం.. ఉద్యాన పంటలే లక్ష్యం

కౌండిన్య పరిసర నియోజకవర్గాల పలమనేరు, పుంగనూరులో ఏనుగుల సమస్య అధికంగా ఉంది. పంట దిగుబడి సమయం వచ్చిందంటే రైతులు వణికిపోతున్నారు. ముఖ్యంగా కౌండిన్య ప్రాజెక్టుకు అత్యంత సమీపంలోని పులిచెర్ల మండలంలో పది రోజులుగా 16 ఏనుగులతో కూడిన ఓ మంద బీభత్సం సృష్టిస్తుంది. వరి, టమాట, సపోటా, అరటి, మామిడి పశుగ్రాసం, మొక్కజొన్న పంటలనే లక్ష్యంగా చేసుకున్నాయి. ఉద్యాన చెట్ల కొమ్మలు విరిచేసి, వరిని తొక్కేస్తూ నష్టం చేస్తున్నాయి.

ముందుగా గుర్తించి అప్రమత్తం

వైకాపా ఐదేళ్ల పాలనలో అటవీ శాఖ అధికారులు

పలు గ్రామాల్లో తీవ్ర నష్టం

పులిచెర్ల మండలంలోని పాళెం, దేవళంపేట, పాతపేట, బోడిరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో వరుస దాడులు జరిగాయి. పాళెంలో 10 ఎకరాలు, పాతపేట 10, ఆవులపెద్దిరెడ్డిగారిపల్లె 15, దేవళంపేట ఒకరికి చెందిన భూముల్లో నష్టం జరిగింది. వరి 15 ఎకరాలు, పశుగ్రాసం 20 ఎకరాలు, సుమారు 500 మామిడి చెట్ల కొమ్మలు విరిచి నాశనం చేసినట్లు అధికారులే గుర్తించారు. అయితే వీటికి పరిహారం అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది.

టమాటాకు నష్టం



రెండు ఎకరాల్లో టమాటా సాగుకు రూ.4 లక్షలు ఖర్చు చేశా. ప్రస్తుతం పంట దిగుబడి దశలో ఉంది. విపణిలో కిలో రూ.70 పలుకుతుంది. ఏనుగులు రెండు సార్లు దాడి చేయడంతో పంటకు అధిక నష్టం వాటిల్లింది. కాపాడుకునేందుకు అదనంగా రూ.40 వేల ఖర్చుతో 50 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశా. మండలం వేసుకుని పొలం వద్దే కాపలా ఉంటున్నాను.

- మధు, కోటపల్లె, బాధిత రైతు

మురుగు సమస్యకు పరిష్కారం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారిపై మురుగు ప్రవహిస్తోంది. ఈ సమస్యపై ఈనెల 8న 'మేమున్నాం..మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి సరోజవయ్య కార్మికులతో బుధవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. ఎగువ ప్రాంత కాలువలు శుభ్రం చేయించారు.

తొలగిన చెత్త

నడుం, న్యూస్‌టుడే: స్థానిక చెన్నకేశవస్వామి ఆలయ పరిసరాల్లో చెత్త తొలగించాలంటూ స్థానికులు ఫిర్యాదుతో 'మేమున్నాం మీకుతోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి హసీనా బుధవారం పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్త తొలగింపజేశారు.

కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు

పుంగనూరు గ్రామీణ: మండలంలోని నేతిగుట్లపల్లె పంచాయతీ ఎర్రగుంట్లపల్లె వీధుల్లో మురుగు కాలువలు నిర్మాణానికి రూ.10 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీడీవో లీలా మాధవి తెలిపారు. పారిశుద్ధ్య సమస్యపై బుధవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆమె స్పందించి మాట్లాడారు. నిధులు రాగానే కాల్వలు నిర్మిస్తామన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు

శాంతిపురం, న్యూస్‌టుడే: ఆర్టీసీ ప్రయాణికులకు అన్ని విధాలా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని సంస్థ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం అన్నారు. శాంతిపురం మండల తెదేపా నాయకులు విశ్వనాథనాయుడు, జనార్దన్‌రెడ్డి, ఉదయకుమార్, జయరామిరెడ్డి తదితరులు ఆయను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. **కుప్పం పట్టణం:** ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న పీఎస్ మునిరత్నంను బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా సన్మానించారు.



పీఎస్ మునిరత్నంను సత్కరిస్తున్న నాయకులు



పుంగనూరు: సరస్వతీదేవి అలంకారంలో అన్నపూర్ణాదేవి ◆ సరస్వతీదేవి అలంకారంలో పార్వతీదేవి ◆ పుంగనూరు: ప్రత్యేకాలంకారంలో గంగమ్మ ◆ బైరెడ్డిపల్లెలో సరస్వతీదేవిగా ◆ పలమనేరులో.. ◆ నడుంలో.. ◆ పెద్దపంజాణిలో.. ◆ సోమల: పట్టపల్లెలో..

అమ్మ.. శక్తి స్వరూపిణి

న్యూస్‌టుడే, బృందం: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కుప్పం, పలమనేరు, పుంగనూరు పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లోని ఆలయాలు, మండపాల్లో అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు. బోయకొండ గంగమ్మ ఆలయంలో విశేష పూజలు జరిగాయి. పుంగనూరులోని గ్రామ దేవతల ఆలయాల్లో మహిళలు పూజలు చేపట్టారు. సోమలలో చిన్నారులు సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు.

పాఠకులకు ఇదేమి కష్టం సారూ

విజ్ఞాన నిలయమైన గ్రంథాలయం శిథిల భవనంలో నడుస్తూ నిత్యం పాఠకులకు ఇబ్బంది పెడుతోంది. ఇటీవల కురిసిన వర్షం కారణంగా పైకప్పులో నీరు నిలిచి.. పెచ్చులూడి కారుతుంది. ఫలితంగా విలువైన పుస్తకాలు తడుస్తున్నాయి. భవనంలోకి ప్రవేశించే నీటిని డబ్బాలు పెట్టి పట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఏళ్లుగా ఇలాంటి దుస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఫలితంగా పాఠకుల అవస్థలు వర్ణనాతీతం.

- న్యూస్‌టుడే, కుప్పం పట్టణం



పల్లెదారి.. అధ్వానంగా మారి

సదుం-పొట్టిరెవారిపల్లె రహదారిలో ప్రయాణమంటే వాహనదారులు వణికిపోతున్నారు. రూడారికి ఇరువైపులా ముళ్ల చెట్లు, పొదలు పెరిగిపోయాయి. ఫలితంగా రాత్రిళ్లు ఎదురుగా వాహనాలు వస్తే ఇబ్బందిగా మారుతుంది. ఇలాగే చాలా మంది ప్రమాదాల బారిన పడ్డట్లు గ్రామస్థులు చెబుతున్నారు. కంపచెట్లు ఎత్తుగా పెరిగిపోవడంతో మలుపు కనిపించక ఇబ్బందిగా మారిందని.. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నడుం



ఆదమరిస్తే ప్రమాదమే

పుంగనూరు-వనమలదిన్నె ప్రధాన రహదారికి అనుసంధానమైన మేలుపట్ల రోడ్డు గుంతలతో ప్రమాదకరంగా తయారైంది. వర్షాలకు పగటి పూట వాహనదారులు రోడ్డు పక్కకు తొలగి వెళుతున్నారు. అవగాహన లేనివారు, రాత్రిపూట వేగంగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల గురవుతున్నారు. సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఎంపీడీవో లీలా మాధవి మాట్లాడుతూ.. రోడ్డును పరిశీలించి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు.

- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ



బాల కార్మికులుంటే కఠిన చర్యలు

పుంగనూరు, న్యూస్‌టుడే: బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని కార్మికశాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు హెచ్చరించారు. బుధవారం మండల సంస్థ సేవాదికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలబాలికలు బడిలో ఉండాలని.. పనిలో కాదని.. కార్మికులను సంబంధిత యజమానులపై చర్యలు తప్పవన్నారు. ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ, ఐసీడీఎస్ అధికారులు

కల్తీనెయ్యి కారకులపై చర్యలు తీసుకోవాలి

పుంగనూరు, న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా కారకులపై చర్యలు తీసుకోవాలని పుంగనూరు మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ వద్ద మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, నాటి తితిదే ఛైర్మన్లు కరుణాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి చిత్రపటాల వద్ద నిరసన తెలిపారు. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీయడంతో పాటు, తితిదేను అపవిత్రం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బాబు, అయూబ్‌ఖాన్, నరసింహులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: గర్భిణులు ముందస్తుగా లింగ నిర్ధారణ పరీక్ష చేయించుకోవడం చట్టరీత్యా నేరమని వైద్యాధికారి విజయచందర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆడ బిడ్డ అని తెలియగానే చిదిమేస్తున్న విష సంస్కృతి వీడాలని చెప్పారు. స్త్రీ, పురుష నిష్పత్తి తగ్గడానికి ఈ పరీక్షలు కారణమని వివరించారు. మహిత పౌండేషన్ గర్భిణులకు పోషకాహారం పంపిణీ చేశారు. హెచ్ఈ రామిరెడ్డి, సీహెచ్‌వో అనూరాధ, సంస్థ నిర్వాహకులు శాంతమ్మ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో బాలాజీ సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం మండలంలోని శంకర్రాయలపేట, అమ్మరాజుపల్లె, లింగాపురం సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లే సిబ్బంది రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. జడ్పీ వైస్‌ఛైర్మన్ శ్రీనివాసులు మంగళవారం శంకర్రాయలపేట సచివాలయం తనిఖీ చేసిన సమయంలో సిబ్బంది లేకపోవడంపై విచారించారు.



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలాజీ

ఏడాదిగా కూరగాయల వితరణ

చౌడేపల్లె, న్యూస్‌టుడే: బోయకొండ గంగమ్మ ఆలయంలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ఉచిత అన్నదానానికి ఉచితంగా కూరగాయలు వితరణ చేస్తున్న పలమనేరుకు చెందిన సీఎస్. నవనీత్‌కుమార్‌ను బుధవారం ఆలయ అధికారులు సత్కరించారు. దాత మాట్లాడుతూ ఆలయంలో ప్రత్యేక రోజులు మినహాయించి మిగిలిన రోజులు జరిగే లక్ష కుంకుమార్చన, దసరా మహోత్సవాల్లో కూరగాయలు ఇవ్వాలని భవిష్యత్‌లోనూ సరఫరా చేస్తానని తెలిపారు.



దాతకు ప్రసాదాలు ఇస్తున్న ఆలయ అధికారులు

అప్రమత్తత అవసరం

పుంగనూరు, న్యూస్‌టుడే: వాతావరణంలో మార్పులు వచ్చిన నేపథ్యంలో సంపూర్ణ ఆరోగ్యం పొందడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏరియా ఆస్పత్రి పర్యవేక్షకులు మధుసూదనరావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్సీ మునస్వామయ్య శెట్టి వీధిలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన ప్రజలకు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేసి మాట్లాడారు. హోమియో వైద్యాధికారి నాగేనాయక్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సంఘాలు.. ఎన్నికలు.. పలమనేరు: పట్టణంలో ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో బలిజ ఆధ్వర్యంలో సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా సుధాకర్, అధ్యక్షులుగా రూపేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఆర్యచారి కిరణ్ కుమార్ ఎన్నికైనట్లు తెలిపారు. **పుంగనూరు:** పట్టణ నాయీబ్రాహ్మణ చైతన్య శక్తి సంఘ అధ్యక్షులుగా వెంకటేష్ ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక త్యాగరాజస్వామి ఆలయంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా సీతారామయ్య, ఉపాధ్యక్షులుగా భద్ర రమణ ఎన్నికయ్యారు.

వదంతులు నమ్మొద్దు.. సదుం: మండలంలోని నడిగడ్డ పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరిస్తుందని బుధవారం వదంతులు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడ పరిశీలించారు. పాదముద్రలు సేకరించారు. అవి చిరుతవి కావని రేసుకుక్క, అడవిపిల్లి అడుగులను పోలి ఉన్నట్లు చెప్పారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

విద్యార్థులకు పద్యాల పోటీలు.. పలమనేరు: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు పద్యాల పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తులసీనాథం నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వందకు పైగా పద్యాలు కంఠస్థం కలిగిన పిల్లలు

కళ్లకు గంతలతో నిరసన.. పెద్దపంజాణి: రెవెన్యూ సమస్యలు పరిష్కారంలో ఉదాసీనంగా వ్యవహరిస్తూ పేదల జీవితాలతో ఆడుకుంటున్నారని జాతీయ మానవహక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షుడు డీపీ మునిరత్నం అన్నారు. స్థానిక మండలకేంద్రంలో బుధవారం మూడోరోజు కళ్లకు నల్ల గంతలు కట్టుకుని వినూత్నంగా రిలేనిరాహార దీక్ష చేపట్టారు. కృష్ణప్ప, పార్థసారథి, గుర్రం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఈనెల 20వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 27న పోటీలు ఉంటాయని 50 బహుమతులు ఇస్తామన్నారు.

ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం.. కొంతపురం: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగునీటి ఎద్దడి అధిగమించేందుకు ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఏవో అశోక్‌రెడ్డి సూచించారు. మండల పరిధి చిన్నారిదొడ్డిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. చిలుపాలు, శ్రీనివాసులురెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. కల్లూరు: భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడితే మంచి దిగుబడులు పొందవచ్చని ఏవో ఫోటోవాస్ సూచించారు. బుధవారం మండలంలోని మతుకువారిపల్లె, వెంకటదాసరిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

మహిళామణులు.. ప్రగతికి అడుగులు

- ◆ చిరువ్యాపారాలతో రాణింపు
- ◆ అందివచ్చిన పొదుపు రుణాలు

మహిళామణులు ఆర్థిక ప్రగతి దిశగా అడుగులు వేస్తున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు తీసుకుని రాణిస్తున్నారు. మండలంలో 1,033 మహిళా సంఘాల్లో రూ.22 కోట్ల బ్యాంకు రుణాలు తీసుకుని వివిధ వ్యాపారాలు చేస్తూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తున్నారు.

- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

ఆర్థిక ఇబ్బందులు తప్పాయి

నల్లారపల్లె గ్రామానికి చెందిన శివకుమార్ భార్య సుభద్ర 2009లో చౌడేశ్వరి ఎస్‌హెచ్‌జీలో చేరారు. అప్పటి నుంచి పొదుపు చేసుకుంటూ బ్యాంకు నుంచి రూ.5 లక్షలు, వీవో సీఐఎఫ్ నుంచి రూ.1.50 లక్షలు, స్త్రీ నిధి నుంచి రూ.50 వేలు ఇలా సుమారు రూ.7 లక్షల రుణం తీసుకుని సకాలంలో బ్యాంకులో చెల్లించారు. జీవనం వచ్చిన రుణంతో 3 పాడి ఆవులు కొనుగోలు చేశారు. టైలరింగ్ దుకాణం నిర్వహిస్తున్నారు. రోజుకు ఖర్చులు పోనూ రూ.600 వరకు ఆదాయం వస్తుంది. పాడితో మరో రూ.700 సంపాదిస్తున్నారు. ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన జీవితం గడుపుతున్నామని సుభద్ర సంతోషం వ్యక్తం చేశారు.



ఇల్లు కట్టుకుని.. పిల్లలను చదివిస్తున్నా

భీమగానిపల్లె పంచాయతీ రాంపల్లెకు చెందిన రామకృష్ణారెడ్డి భార్య గాయత్రి నెహ్రూ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరారు. పలు విడతల్లో రూ.7 లక్షల రుణం తీసుకున్నారు. ప్రతి రూపాయిని సద్వినియోగం చేసుకుని సొంత ఇంటి కల నెరవేర్చుకున్నారు. అలాగే సెంట్రింగ్ సామగ్రి దుకాణం నిర్వహిస్తున్నారు. వచ్చే ఆదాయంతో ఇద్దరు పిల్లలకు ఉన్నత చదువులు చెప్పిస్తున్నారు. సంఘాల ద్వారా రుణం పొంది సమాజంలో ఉన్నతంగా జీవిస్తున్నామని అంటున్నారు **గాయత్రి**



వడ్డీల బాధ తప్పింది..

అత్యవసర సమయాల్లో అధిక వడ్డీలకు తెచ్చుకుని వాడుకునే బాధ తప్పింది. అర్బంగం గ్రామానికి చెందిన చిన్నమ్మకారుమానిని నేతిగుట్లపల్లె పంచాయతీ ఎర్రగుంట్లపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య చంద్రకళ చెబుతున్నారు. గతంలో వడ్డీల కట్టలేక ఇబ్బంది పడేవారు. శ్రీ వినాయక స్వయం సహాయక సంఘంలో చేరి ఐదు విడతలుగా రూ.9.50 లక్షల రుణం పొందారు. మొదట కిరాణా దుకాణం ఏర్పాటు చేశారు. అప్పు తీరిపోయాక ఇంటి దగ్గరే పిండి మిషన్ ఏర్పాటు చేసుకున్నారు. పగలు టైలరింగ్ చేస్తూ రోజుకు సుమారు రూ.1500 సంపాదిస్తున్నారు చంద్రకళ



ఉన్నత చదువులకు దోహదం

నిన్నటి వరకు పొట్ట చేతపట్టి రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. పట్టుదల కృషితో కష్టపడి ప్రతి పైసాను సద్వినియోగం చేసుకుని నిలదొక్కుకున్నారు ఆమె. మండలంలోని మేలుందొడ్డి గ్రామానికి చెందిన నాగలక్ష్మి. 2003లో గాయత్రి మహిళా సమాఖ్య సంఘంలో సభ్యురాలిగా చేరి నేటికి రూ.11 లక్షల వరకు రుణం తీసుకున్నారు. కిరాణా దుకాణం, పాడి పోషణతో నెలకు నెలకు రూ.25 వేల ఆదాయం వస్తుంది. గౌరవంగా జీవించేందుకు దోహద పడిందని అంటున్నారు **నాగలక్ష్మి**



ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎగువపల్లెకు చెందిన వెంకటలక్ష్మమ్మ (70) ఈ నెల 8న పుంగనూరులోని కుమార్తె ఇంటికి వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి స్వగ్రామానికి బస్సులో వచ్చి దిగువపల్లె బస్టాప్ వద్ద దిగింది. అక్కడి నుంచి ఎగువపల్లెలోని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఓ యువకుడు ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఏనుగుల దాడిలో పాడి ఆవు..

కల్లూరు, న్యూస్‌టుడే: ఏనుగుల దాడిలో పాడి ఆవు మృతి చెందింది. ఈ ఘటన బుధవారం వేకువజామున కల్లూరు పంచాయతీ గెండ్లోళ్లపల్లెలో జరిగింది. ఏనుగుల మంద రైతు కుమార్‌రెడ్డి సాగు చేసిన వరిపై దాడి చేసింది. అదే సమయంలో ఏనుగుకు నాలుగు ఆవులు అడ్డుగా వచ్చాయి. వాటిపై దాడి చేయడంతో కుమార్‌రెడ్డికి చెందిన ఆవు మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎఫ్ఎస్ ఓ షఫీ, ఎఫ్‌బీవో మున్నా ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆవు మృతిని పాలీక్లినిక్ కల్లూరు పశువైద్యాధికారి మునిచంద్ర పోస్టుమార్టం చేశారు.